ప్రజాశక్తి

గురువారం 3 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కు రక్షణకు ఉవ్వెత్తున దీక్షలు

◆ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి ◆ ప్రైవేటీకరణకు పూనుకుంటే తీవ్ర పరిణామాలు

◆ కేంద్ర బిజెపిని హెచ్చరించిన నేతలు

విశాఖలో జరిగిన దీక్షల్లో లోకనాథం, కెఎస్.చలం, జెవి.సత్యనారాయణమూర్తి

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఉవ్వెత్తున నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని బుధవారమూ నినాదాలు మిన్నంటాయి. ప్రైవేటీకరణకు పూనుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని నేతలు హెచ్చరించారు.

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంతగనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విధానాలు మానుకోకపోతే తెలుగోడి సత్తా చూపుతామని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కెఎస్.చలం హెచ్చరించారు. ఉక్కు రక్షణ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం భారీ ఎత్తున నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ప్రారంభిస్తూ లోకనాథం, సత్యనారాయణ మూర్తి, చలం మాట్లాడారు. విశాఖ ఉక్కు – తెలుగోడి హక్కు నినాదంతో ప్లాంట్‌ను రక్షించుకుంటామన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ఎదుర్కోవడానికి విశాఖ కార్మిక వర్గం, బిజెపియేతర రాజకీయ పార్టీలు, ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి, జనసేన కూటమి అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ను రక్షిస్తామని చెప్పిన నాయకులు నేడు బిజెపి చర్యలను ఎందుకు అడ్డుకోలేకపోతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లడ్డూపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆస్తి, రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ అయిన స్టీల్‌ప్లాంట్‌పై ఎందుకులేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ భూములను కాజేయడం కోసం మోడీ ప్రభుత్వం ప్రైవేట్‌జపం చేస్తుంటే రాష్ట్రంలో ప్లాంట్‌ను కాపాడాల్సిన ప్రాంతీయ పార్టీలు నోరుమెదపకుండా చాపకింద నీరులా సహకరించడం తగదన్నారు. నాలుగేళ్లుగా ప్లాంట్ రక్షణ కోసం విశాఖ కార్మిక, ప్రజా సంఘాలు ఉద్యమించి ప్రైవేటీకరణ చర్యలు అడ్డుకున్నాయి తప్ప ఏ ఒక్క ప్రధాన రాజకీయ పార్టీ అడ్డుకోలేకపోయిందని తెలిపారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ ఛైర్మన్ భోగవిల్లి నాగభూషణం, ఎం.మన్మధరావు మాట్లాడుతూ మిగతా 2లో..

కూర్మన్నపాలెం కూడలిలో రోడ్డుపై బైఠాయించిన కాంట్రాక్టు కార్మికులు, చిత్రంలో శర్మిల, అయోధ్యరామ్

కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి

దిగొచ్చిన ఉక్కు యాజమాన్యం

◆ ఎవరినీ తొలగించబోమని స్పష్టీకరణ

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉద్యోగాల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మంగళ, బుధవారాల్లో ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన భారీ ఆందోళనకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బుధవారం సాయంత్రానికి దిగొచ్చింది. 'ఎవరినీ తొలగించం. అందరినీ విధుల్లో కొనసాగిస్తాం' అని విశాఖలోని లేబర్ కమిషనర్ సమక్షంలో ఒప్పుకుంది. ఈ విషయమై కాంట్రాక్టు కార్మిక సంఘాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ హర్షం వెలుబుచ్చాయి. ఇది కార్మిక విజయమని చెప్పుకొచ్చాయి. కాంట్రాక్టు కార్మికులను తొలగించేందుకు ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిన రోజు నుంచీ స్టీల్‌ప్లాంట్ వేదికగా ఉద్యమం రోజురోజుకూ ఉధృతమైంది. అది మంగళవారానికి ఉధృత రూపం దాల్చింది. ఇడి వర్క్స్ కార్యాలయాన్ని వేలాది మంది కార్మికులు ముట్టడించి అర్ధరాత్రి వరకూ ఆందోళన కొనసాగించారు. బుధవారం కూర్మన్నపాలెం కూడలిలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమం జరుగుతుండగానే మరోవైపు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి, కాంట్రాక్టు కార్మిక సంఘాలకు మధ్య సుదీర్ఘ చర్చలు నడిచాయి. తుదకు కార్మిక పోరాటానికి యాజమాన్యం మిగతా 2లో..

గాంధీజీకి ఘన నివాళి

▶ వార్త 7లో..

నూతన ఎక్సైజ్ పాలసీని రద్దు చేయాలి

▶ వార్త 5లో..

విశాఖ నగరానికి స్వచ్ఛ భాగిదారి అవార్డు

రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవశం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్ర స్థాయిలో విశాఖ నగరానికి స్వచ్ఛ భాగిదారి అవార్డు దక్కింది. ఈ మేరకు అవార్డును రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ స్వీకరించారు. ఈ అవార్డును స్వీకరించడం ఆనందదాయకమని, విశాఖ నగర ప్రజలకు ఇది అంకితమని ఆయన అన్నారు. బుధవారం ఆయన మచిలీపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో విశాఖ నగరానికి ప్రథమ స్థానంగా వచ్చిన స్వచ్ఛ భాగిధారి అవార్డును అందుకున్న నేపథ్యంలో మీడియాతో మాట్లాడారు. నగర మేయర్, ప్రజా ప్రతినిధులు, నగర ప్రజలు, పారిశుధ్య కార్మికుల సేవల సహకారంతోనే ఈ స్వచ్ఛ భాగిధారి అవార్డు లభించిందని అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు విశాఖ నగరంలో 'స్వచ్ఛత స్వభావం – స్వచ్ఛత మిగతా 2లో..

సిఎం నుంచి అవార్డు అందుకుంటున్న సంపత్‌కుమార్

ఒపిఎస్‌కు పోరాటాలే మార్గం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాత పెన్షన్ విధానానికి మరొకటి ప్రత్యామ్నాయం లేదని, దానికోసం పోరాటం తప్ప మరొక మార్గం లేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం విశాఖ రక్షణ రంగ కార్మికులు పాత పెన్షన్ విధానం సాధించేంత వరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ స్కీము పేరుతో కార్మికులను దగా చేస్తోందని, దీనిని ఎవరూ పాత పెన్షన్ కంటే మంచిదని అనుకోవడం లేదని తెలిపారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు మిగతా 2లో..

శ్రద్ధాంజలి

జననం: 18-08-1968

మరణం: 23-09-2024

మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిత్వంతో మా అందరితోపాటు బంధువర్గాన్ని, స్నేహితులని, సన్నిహితులందరినీ ఒకే కుటుంబంగా ఆదరించి, అందరి హృదయాలలో సుస్థిరస్థానాన్ని పొందియున్న మీయొక్క ఆకస్మిక మరణం మాకు తీరనిలోటు. మీకు సద్గతి ప్రాప్తించాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ వేమనమంద వెంకట నరసింహామూర్తిరాజు (రాజా) గారు

Gajuwaka Ex. Municipal Chairman

శోకతప్త హృదయాలతో... మీ...

భార్య: వేమనమంద జ్యోతి

కుమారుడు : వేమనమంద బలరామమూర్తిరాజు (నిశాంత్)

కుమార్తె - అల్లుడు - మనుమరాలు : బి. నిషితరాజ్ - బి. నిఖిల్‌వర్మ - బి. అమైరావర్మ

తమ్ముడు - మరదలు : వి.వి. సీతారామరాజు (బుజ్జి) - వి. శ్రీదేవి

తమ్ముడు కుమారుడు, కుమార్తె : వి. ప్రణవ్ వర్మ, వి. శ్రీఅమ్మాజీ ప్రణతి

అక్కలు - బావలు - మేనల్లుళ్ళు:

ఇ. సూర్యరత్నం - ఇ. సూర్యనారాయణరాజు - ఇ. దీపక్‌వర్మ - ఇ. పూజిత కుమారుడు: ఇ. ధ్యాన్‌వర్మ

కె. పద్మావతి - కె.వి. సుబ్బరాజు - డా॥ కె. శ్రీకృష్ణ చైతన్యవర్మ - డా॥ కె. ప్రియాంక కుమారుడు: కె. శ్రీఅన్వాన్‌వర్మ

మేనకోడలు: ఎ.యస్.వి. దీప్తి - ఎ. రవికాంత్ వర్మ మేనకోడలు కుమారుడు: ఎ. ఆరిష్‌వర్మ

పెద్దకర్మ: తేది. 03-10-2024 గురువారం శివాజీనగర్‌లో మా స్వగృహము నందు జరుపబడును.

మొదటి పేజీ తరువాయి..

దిగొచ్చిన ఉక్కు యాజమాన్యం

వెనక్కి తగ్గక తప్పలేదు.

రోజంతా తీవ్ర ఆందోళనలు

బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉక్కు ప్రైవేటీకరణ, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విశాఖలో పలుచోట్ల బుధవారం ఆందోళనలు జరిగాయి. కూర్మన్నపాలెం కూడలిలో ఉదయం 10 గంటల నుంచి కార్మికులు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి పెద్దపెట్టున నినాదాలు చేశారు. దీంతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి కార్మికులను తొలగించాలని చూసినా ఎవరూ వెనక్కి తగ్గలేదు. ఈ క్రమంలో తోపులాట చోటుచేసుకుంది. కాంట్రాక్టు కార్మికులను ఉద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికులది కీలక పాత్ర అని తెలిపారు. వారిని తొలగిస్తే ఊరుకునేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ మాట్లాడుతూ కార్మికుల తొలగింపు నిర్ణయం అత్యంత దుర్మార్గమన్నారు. కార్మికుల ఆందోళన విషయం తెలిసి పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల అక్కడకు చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఆమె కూడా రోడ్డుపై బైఠాయించి నినదించారు. 48 గంటల్లోపు రాష్ట్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న నాలుగు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునేలా చర్యలు చేపట్టకుంటే నిరాహార దీక్షకు దిగుతానని ప్రకటించారు. నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం ముందుకొచ్చి కార్మికులకు మద్దతు ఇవ్వాలన్నారు. పాలకుల నిర్వాకం వల్లే ప్లాంట్ నిర్వీర్యం అవుతోందని తెలిపారు. కేంద్రానికి ఉక్కు భూములపై కన్ను పడిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకునే ప్రయత్నం చేయడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు తప్ప చేతలు చూపడం లేదని విమర్శించారు.

విశాఖ నగరానికి స్వచ్ఛ భాగిదారి అవార్డు

సంస్కారం' అనే నినాదంతో చేపట్టిన కార్యక్రమంలో పరిశుభ్రత పాటించడంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ స్వచ్ఛత కి భాగిదారీ, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయిమిత్ర సురక్షా శిబిరాలను విరివిగా చేపట్టినట్టు తెలిపారు. ఇలా ప్రజలను భాగస్వామ్యం చేస్తూ పరిశుభ్రత, స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించడంలో విశాఖ నగరానికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం దక్కిందని తెలిపారు.

ఒపిఎస్‌కు పోరాటాలే మార్గం

ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

పోరాడుతున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై రోజుకొక మాట మాట్లాడుతున్నారని, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నారని, వీటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సిపిఎస్, జిపిఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని, పాత పెన్షన్ కోసం జరిగే పోరాటంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో కలిసి నడుస్తామనిఏపీ ఎన్జీవోస్ విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్ అన్నారు. గుడ్డు కంటే మెల్ల మేలని ఎన్‌పిఎస్ కంటే యుపిఎస్ కొంత మెరుగుదల కనిపించినా పాత పెన్షన్ విధానానికి ఇది సాటి రాదని పాత పెన్షన్ విధానం కోసం అందరం కలిసి పోరాడుదామని సూపర్వైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ చక్రవర్తి అన్నారు. హాజరైన అందరితో పాత పెన్షన్ సాధించేవరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేయించిన వాల్తేర్ డివిజన్ లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి బోలోనాథ్ మాట్లాడుతూ యుపిఎస్‌ను సమర్థించిన రెండు పెద్ద రైల్వే ఫెడరేషన్‌లకు రైల్వే సొసైటీకి జరిగిన ఎన్నికలలో కార్మికుల బుద్ధి చెప్పారని, దీనిని అందరూ గుర్తించి పాత పెన్షన్ కోసం పోరాటం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. నూతన పెన్షన్ విధానం వచ్చిన దగ్గర నుండి అలుపెరగకుండా పోరాడుతున్న, ఏకీకృత పెన్షన్ స్కీమ్‌పై జరిగిన మీటింగ్‌కు వెళ్లకుండా పాత పెన్షన్ విధానం కోసం ఎఐడిఇఎఫ్ నికరంగా నిలబడి పోరాడుతోందని అఖిల భారత కార్యవర్గ సభ్యులు పి.గోపాల్ కృష్ణ అన్నారు. కేంద్రంలో ఒపిఎస్ అమలుకోసం జరిగే పోరాటంలో మమేకమవుతామని టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జున అన్నారు. కార్పొరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ కోసం జరిగే పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు అధ్యక్షత వహించగా, నేవల్ సివిలియన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ముందుగా మహాత్మా గాంధీకి నివాళ్లర్పించారు. ఎన్ఎడిసిఇయు ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసు, ఎంఇఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దీన్ మహమ్మద్, ఎస్‌బిసి, ఎన్ఎస్‌టిఎల్, డిజిఎన్‌పి యూనియన్ నాయకులు, కార్మికులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

54 మాంసం దుకాణాలు సీజ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గాంధీ జయంతి రోజున జివిఎంసి పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా తెరిచిన 54 మాంసం దుకాణాలను సీజ్ చేసినట్టు జివిఎంసి వెటర్నరీ అధికారి డాక్టర్ కిషోర్ తెలిపారు. బుధవారం తెరిచి ఉన్న దుకాణాలపై వెటర్నీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారన్నారు. రూ. 68000 అపరాధ రుసుము వసూలు చేశామని, 180 కేజీల చికెన్,110 కేజీల మటన్, 30 కేజీల చేపలు, 23 కేజీల రొయ్యలను దుకాణాల నుంచి సీజ్ చేసి డంపింగ్ యార్డులో పూడ్చామన్నారు.

ఈ దేశం - నా దేశం పాట విడుదల

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సుదీప్ సాయి సారథ్యంలో రచించి, దర్శకత్వం వహించిన సబ్ కా మాలిక్ ఏక్ హై ఫిలింలోని ఈ దేశం - నా దేశం అనే పాటను జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ఫిల్మ్‌లో కృష్ణారావు, శ్రీనివాసరావు, ఎంటి.రాజు, వర్షిణి నటీనటులుకాగా, డప్పు శ్రీను ఈ పాటను పాడారు. పాట విడుదల కార్యక్రమంలో విశాఖపట్నం షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు అస్రఫ్, స్టీల్‌ప్లాంట్ ఆఫీసర్స్ లాఫ్టర్స్ క్లబ్ నిర్వాహకులు డాక్టర్ కోరుకొండ రంగారావు, గురజాడ సాంస్కృతిక వేదిక నుంచి వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ప్రవీణ్ యాంకర్‌గా వ్యవహరించారు.

ఉక్కు రక్షణకు ఉవ్వెత్తున దీక్షలు

అనకాపల్లిలో కొనసాగుతున్న దీక్షలు

విశాఖలో రమణమూర్తి ఆధ్వర్యాన ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి..) మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి శతవిధాలా ప్రయత్నాలు కొనసాగిస్తోందన్నారు. ఐక్య పోరాటాలతో ఆ కుట్రలను అడ్డుకోగలుగుతున్నామన్నారు. గురువారం మహిళా సంఘాలు చేపట్టిన ఉక్కు దీక్షలో మహిళలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, సిఐఎఫ్‌టియు జాతీయ కార్యదర్శి ఎన్.కనకారావు, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి కె.శంకరరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు కె.దేవా, ప్రజా సంఘాల నాయకులు ఎం.సుబ్బారావు, సత్యన్నారాయణ, ఆర్.లక్ష్మణమూర్తి, పడాల రమణ, బి.జగన్, జెడి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : గాంధీ జయంతి సందర్భంగా చేపట్టిన విశాఖ ఉక్కు సత్యాగ్రహ దీక్షలు విజయవంతమయ్యాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1329వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు ఉక్కు సత్యాగ్రహ దీక్షకు దిగారు. బుధవారం ఉదయం నుంచి సాయంకాలం వరకు జరిగిన దీక్షకు పోరాట కమిటీ నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలనుద్దేశించి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో- కన్వీనర్ జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని, దానిలో భాగంగానే 4000 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి యాజమాన్యం ప్రయత్నం చేస్తోందని, దీనిని తిప్పికొడతామని చెప్పారు.

అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్‌లో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాలేపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను నేడు మోడీ ప్రభుత్వం దశలవారీగా ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. విశాఖ ఉక్కు ఆస్తులను అప్పనంగా కొట్టేయాలని కేంద్ర బిజెపి, రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని విమర్శించారు. తిరుమల లడ్డూ చుట్టూ రాజకీయాలను తిప్పి ప్రజా సమస్యలను, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాలను మరుగున పెడే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా టిడిపి కూటమి స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట వేదిక జిల్లా కన్వీనర్ రుత్తల శంకర్రావు, కో కన్వీనర్ ఆర్. దొరబాబు, సిఐటియు నేతలు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ శ్రీనివాసరావు, ఆర్ దేముడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు పి.సత్యనారాయణ, ఏసుదాసు, అప్పలరాజు, ఐఎఫ్టియు నాయకులు రాంబాబు పాల్గొన్నారు. ఈ దీక్షలకు ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, నాయకులు పరమేశ్వరి, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు బాలు గాడి, లాయర్ సురేష మద్దతు తెలియజేశారు.

విశాఖ ఉక్కు రక్షణకు ప్రజా ర్యాలీ

విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర ప్రజారక్షణ కన్వీనర్ వివి.రమణమూర్తి నాయకత్వంలో బుధవారం నగరంలో వందలాది మందితో మహా ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం నుంచి గురజాడ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆశీలు మెట్ట జంక్షన్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ర్యాలీ అగ్రభాగంలో పలు సాంస్కృతిక సంస్థలు విప్లవ గీతాలను ఆలపించాయి. డప్పుల వాయిద్యాలతో సాగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున మహిళలు, యువకులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద సభ జరిగింది. సభలో కన్వీనర్ వివి.రమణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

జెఎసి మద్దతు

ఉత్తరాంధ్ర ప్రజా రక్షణ సంస్థ కన్వీనర్ వివి.రమణమూర్తి నేతృత్వంలో స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం నిర్వహించిన ఉత్తరాంధ్ర ప్రదర్శనలో జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి మద్దతుగా పాల్గొంది. జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, వైస్ చైర్మన్ భోగవిల్లి నాగభూషణం, ఎ.విమల, కె.కుమారి నేతృత్వంలో జెఎసి నాయకులు, సభ్యులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ ఉక్కు రక్షణకు జెఎసి అందరినీ ఐక్యం చేసి నాలుగేళ్లుగా ఉద్యమిస్తోందని గుర్తుచేశారు.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE BHEEMUNIPATNAM
E.P.NO.27/2019., O.S.NO.171/2018

Between
Y.V.L.Narasimha Murty & Anothers **...Petitioner/Dhr**
And
CH.Bharathi **...Respondent/Jdr**

AUCTION NOTICE

The petitioner/Dhr has filed the above E.P.No.27/2019 in O.S.No.171/2018, for recovery of E.P. Amount, by sale of E.P.Schedule movable property(Home Appliances) and the same is posted to **21-10-2024** for auction sale in the above court premises. Hence intending bidders may participate in auction and buy the home appliances, abiding by the terms and conditions of the Honourable court. If bidders are desirous to see the home appliances, they may contact Dhr by cell.No.9247146643 and see them at Door No.17-39/1, Vizag to Pendurthi Road. by fixing the time with Dhr.40 different home appliances have to be bid all at time, and if declared highest bidder to immediately to pay to court 25% of the bid money. Schedule of 40 appliance of different kind, available with Dhr.

Dhr Value : Rs.64,700/-
Amina Value : Rs.64,700/-
For Further Hearing Date : 28.10.2024
By order of the Court)
Dhr Advocate
Y.V.L.Narasimha Murty, Advocate
1-211, Susarla Colony, Gopalapatnam (PO) Visakhapatnam-530027,
Visakhapatnam **Cell : 92471 46643**
Dtd. 2-10-2024

IN THE HONOURABLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE, BHEEMUNIPATNAM
E.P.26/2019, O.S.NO.139/2017

Between
Ch.Satyanarayana Murty **....Petitioner/Dhr**
And
R.Lakshmi **...Respondent/Jdr**

AUCTION NOTICE

The petitioner/Dhr has filed the above E.P.NO.26/2019 in O.S.No.139/2017 for recovery of E.P.Amount., by sale of the E.P.Schedule Movable Property. (home appliances and the same is posted to **21-10-2024** for auction sale in the above court premises. Hence intending bidders may participate in auction and buy the home appliances, abiding by the terms and conditions of the Honourable court. If bidders are desirous to see the different 30 appliances they may contact the Dhr through his cell.No.8978081295 and see them at door no. 24-232/21, flat no.502, balaji residency, 4th floor simhapuri layout, vepagunta post, visakhapatnam-47. Schedule of appliances is lying with Dhr, If declared highest bidder, immediately to pay to court 25% of the value of bidding. Bidding is to be done for all the 30 appliances at one time.

Dhr Value of the appliances : Rs. 92,250/.
Amina value : Rs. 92,250/-
For Further Hearing...28.10.2024
(By Order of the Court)
Dhr Advocate
Y.V.L.NARASIMHA MURTY. ADVOCATE
1-211, Susarla Colony, Gapalapatnam (P.0) Visakhapatnam-530027
Visakhapatnam **Cell : 92471 46643**
Dtd. 2-10-2024

IN THE HON'BLE COURT OF THE PRICIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM
IA.No. /2024 in IA.No.655/2022 in OS.No.339/2018

Between:
Talasu Ramadevi ...Petitioner/Plaintiff
And:-
Jami Bala Bhaskara Rao (Died) ...Respondent/Defendant
Jami Vijaya Lakshmi @ Satyavathi & others ...Proposed defendants

NOTICE

To,
R-4: Jami Gowthami, D/o. late Bala Bhakararao, W/o. Patnana Rajesh, aged 36 years, R/at D.No.2-3-95, near Vishakha Eye Hospital, Peda Waltair, Vishakhapatnam
R-5: Jami Jyotshna, D/o. late Bala Bhaskararao, W/o. Voonna Bharat, aged 30 years,D.No.6-3-68/1, near Eendau Office, Maddilapalam Junction, Vishakhapatnam.

Please take notice that the above named Petitioner/Plaintiff has instituted the above Petition/suit against you and the you and the same is stands posted to **17-10-2024 at 10.30 A.M.** for yours' appearance. On that day you shall personally or through an Advocate attend before the above named Hon'ble Principal Civil Judge (Senior Division) Court, Srikakulam failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.

// By Court Order //

CH. SATYANARAYANA
ADVOCATE FOR PLAINTIFF,
AMADALAVALASA,
SRIKAKULAM, CELL: 9848098139.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్ విద్యార్థులకు సూచించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌కు నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. కారణాలు ఏమైనా గానీ ఇటీవల కాలంలో యువత డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాల భారిన పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎంఎంఎస్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్న సొసైటీ నిర్వాహకులను అభినందించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కోశాధికారి బి.అప్పారావు, ఉపాధ్యక్షులు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ నియోజకవర్గంగా భీమిలి : ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్రంలో భీమిలిని మోడల్ నియోజకవర్గంగా తయారుచేయడమే తన లక్ష్యం అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ముగింపు సందర్భంగా కాపులుప్పాడ డంపింగ్ యార్డులో ఆయన మాట్లాడుతూ చెత్తపై పన్ను రద్దు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్లు పెట్టినున్నట్లు తెలిపారు. కాపులుప్పాడు డంపింగ్ యార్డ్ చెత్త నుంచి పలు అభివృద్ధికి కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జివిఎంసి మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ, నగరంలోని వార్డులను శుభ్రం చేయాలన్నారు. నైట్ ఫుడ్ కోర్టులపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో జిల్లాలో మూడు లక్షల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీను, కార్పొరేటర్లు మొల్లి హేమలత, లోడగల అప్పారావు, గాడు చిన్ని కుమారి, కందుల నాగరాజు, జోనల్ కమిషనర్ సింహాచలం, జివిఎంసి అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలల భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- పెదబయలు : మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టు గ్రామంలో రూ.18 కోట్లతో నిర్మించిన ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల నూతన భవనాన్ని ఉమ్మడి జిల్లాల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ప్రధాని నరేంద్రమోడీ గిరిజన విద్యార్థులకు నిర్మించిన ఏకలవ్య పాఠశాలను వర్చువల్‌గా ప్రారంభించగా, ఇక్కడ కలెక్టర్, జెడ్‌పి చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ గిరిజన బాలబాలికలకు నాణ్యమైన సమగ్ర విద్యను అందించటానికి కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య నోడల్ పాఠశాలలు ప్రారంభించిందని, ఏజెన్సీ 11 మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్థులు మాతృభాషతో పాటు హిందీ, ఇంగ్లీష్‌లపై పట్టుసాధించాలన్నారు.

ఫిర్యాదుపై స్పందించని సిపి

వృద్ధుని ఆవేదన

ప్రజాశక్తి - ఆరిలోవ : కుమార్తె చావుబతుకుల మధ్య ఉందని, రూ.5 లక్షలు కావాలని తీసుకొని, ఇప్పుడు ఇవ్వకుండా తనను మోసం చేశారంటూ నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరిలోవ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. దీనదయాల్‌పురంలో నివాసముంటున్న ఇజ్జాడ సత్యనారాయణ చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే.... ఆరిలోవ ప్రాంతానికి చెందిన లాయర్ల దంపతులు దుప్పాల వెంకటేశం, సుశీల కలిసి శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన విజయలక్ష్మిని ఇజ్జాడ సత్యనారాయణ వద్దకు తీసుకొచ్చారు. విజయలక్ష్మి కుమార్తె అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉందని, వెంటనే రూ.5 లక్షలు అప్పుగా ఇవ్వాలని, తిరిగి మూడు రోజుల్లో ఇచ్చేస్తామని లాయర్ దంపతులు ఇజ్జాడ సత్యనారాయణకు నమ్మబలికారు. దానికి హామీగా ఒక ఇన్నోవా కారును, ప్రామిసరీ నోటును ఇచ్చి డబ్బు తీసుకెళ్లారు. తరువాత ముఖం చాటేసారు. కారు పోయిందని దాని యజమానితో కేసు పెట్టించి దాన్ని కూడా తీసుకుపోయారు. దీనిపై ఆరిలోవ పోలీసులకు ఇజ్జాడ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. మధ్యవర్తులుగా ఉన్న లాయర్ దంపతులను శాంతి భద్రతల ఎస్ఐ వై.కృష్ణ పిలిపించి మూడు నెలల వ్యవధిలో అతని డబ్బు ఇప్పించేందుకు బైండోవర్ రాయించారు. నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వలేదు. దీంతో ఎస్ఐ కృష్ణను బాధితుడు కలిశాడు. రాసిన బైండోవర్ కనిపించడం లేదని, ఇది సివిల్ మేటర్ అని, మీరు కోర్టులో తేల్చుకోండని పోలీసు జులుం చూపిస్తున్నట్టు వృద్ధుడు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందంటున్నారు. తనను మోసం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసి, వారికి సహకరిస్తున్న ఎస్ఐ కృష్ణపై చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

కేంద్రకారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవం

ఖైదీలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి - ఆరిలోవ : మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని విశాఖ కేంద్రకారాగారంలో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ వి.శేషమ్మ, కెజిహెచ్ పర్యవేక్షణాధికారి డాక్టర్ పి.శివానంద ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఖైదీలు తమ హక్కులతో పాటు బాధ్యతలను తెలుసుకోవాలన్నారు. కేంద్రకారాగారంలో పరివర్తన చెంది బయటకు వెళ్లి మంచి జీవితం గడపాలన్నారు. కేంద్రకారాగారం పర్యవేక్షణాధికారి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మహాత్మ గాంధీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారి అడుగు జాడల్లో మెలగాలన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆశ్రమ వాసులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప పర్యవేక్షణాధికారి ఎన్.కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాలు

వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జూ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో బుధవారం వన్యప్రాణి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ (పిసిసిఎఫ్) శ్రీకంఠనాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనిలో భాగంగా నిర్వహిస్తున్న పోటీలకు వివిధ పాఠశాలలు, కళాశాలల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు, వన్యప్రాణి ప్రేమికులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిసిసిఎఫ్ శ్రీకంఠ నాథరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు, జంతు ప్రేమికుల్లో వన్యప్రాణుల పట్ల అవగాహన పెంచేందుకు కార్యక్రమాలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మంగమ్మ, జూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను వినియోగించుకోవాలని భీమిలి మండలం టి.నగరపాలెం సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి ఉపాధి కూలీలను కోరారు. స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం ఉపాధి కూలీలకు సమావేశం నిర్వహించారు. ఇటీవల గ్రామ సభలో గుర్తించిన పనుల వివరాలను ఆమె వివరించారు. వలసల నివారణకు ఉపాధి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ వార్డు సభ్యులు పూసర్ల రామారావు మాట్లాడుతూ, ఇరిగేషన్ కాల్వ ఆక్రమణకు గురైందని, ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, మాజీ సర్పంచ్ పి.రాము, వార్డు సభ్యులు పి.అప్పారావు, నరేంద్ర, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఛాయా గౌతమి

నేరాలు ఘోరాలు

బైక్ రైడర్లపై కేసు

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బైక్ రైడ్ చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు నార్త్ జోన్ ట్రాఫిక్ సిఐ కాంతారావు తెలిపారు. నగరానికి చెందిన కొందరు, మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన కొందరు యువకులు శ్రీరామ్ ప్రాపర్టీ రోడ్డులో వాహనాలను మితిమీరిన వేగంతో నడపటంతో పాటు పెద్దగా ధ్వని చేయడంతో స్థానికులు సమాచారం మేరకు వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట : ఎటువంటి అనుమతులు లేకుండా పాన్ షాప్‌లో మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డులో పాన్ షాప్‌లో మద్యం అమ్ము తున్నట్లు సమాచారం రాగా పోలీస్ సిబ్బందితో వెళ్ళి దాడి చేయగా తొమ్మిది మద్యం క్వార్టర్ బాటిల్స్ దొరికాయన్నారు .దీనికి సంబంధించి షాప్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనధికారికంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమ్‌వివిఎస్.మూర్తి స్మృతివనం వద్ద నివాళులర్పిస్తున్న గీతం సిబ్బంది

ఎమ్‌వివిఎస్.మూర్తికి నివాళి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వ్యవస్థాపకులు డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఎమ్‌వివిఎస్.మూర్తి స్మృతివనం వద్ద నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు మాట్లాడుతూ, గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (గీతం) విద్యాలయాన్ని స్థాపించడానికి ఎమ్‌వివిఎస్.మూర్తికి మహాత్మా గాంధీ స్ఫూర్తి అని తెలిపారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చి పారిశ్రామిక, రాజకీయ, విద్యారంగాలలో డాక్టర్ ఎమ్‌వివిఎస్. మూర్తి తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. జీవితంలో విజయాలను, అపజయాలను సమంగా స్వీకరించడం, అంకితభావం, కష్టపడే తత్వం ఆయన నుంచి నేర్చుకోవలసిన విషయాలన్నారు. ఎంత కష్టం అయినా గాంధీ మార్గంలో డాక్టర్ ఎమ్‌వివిఎస్.మూర్తి సాగించిన ప్రయాణాన్ని గీతం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ్, గీతం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, జిమ్సర్ ప్రో-వైసాఛాన్సలర్ ప్రొఫెసర్ బి.గీతాంజలి, గీతం సలహాదారు ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ, డీన్లు, ప్రిన్సిపల్స్, సిబ్బంది పాల్గొన్నారు.

పలుచోట్ల ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -మధురవాడ, ఆనందపురం : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని స్వాతంత్రనగర్ కాలనీలో శ్రీ సత్య సాయి సేవ ట్రస్ట్ ఆధ్వర్యాన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయి దీరాజ్, డాక్టర్ కుసుమ స్రవంతి, డాక్టర్ సైయిద్ అజామాల్ సాబుద్దన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు.

ఆనందపురం మండలం గిడిజాలలోఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖ ఇండస్ హాస్పిటల్ సహకారంతో ఏర్పాటుచేసిన శిబిరంలో 210 మందికి రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సిహెచ్. నితీష్, స్త్రీల వైద్య నిపుణులు దేదీప్య రోగులకు సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, ఎక్స్ సర్పంచ్ కోరాడ రాము, టి.లక్ష్మోజి, ఇండస్ ఆసుపత్రి మేనేజర్ ప్రభుదాస్, శంకర్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిడిజాలలో వైద్యశిబిరం...

పలుచోట్ల 'స్వచ్ఛతా హీ సేవా'

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పరిసరాలను శుభ్రం చేశారు.

తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ షరీఫ్, కో- ఆర్డినేటర్ జి.చిన్నయ్య, ఫిజికల్ డైరెక్టర్ కె.చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు .

భీమిలిలోని ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బేతాని స్కూల్, అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ ఆధ్వర్యాన బీచ్‌ను శుభ్రపరిచారు. ఆయా పాఠశాలలు, కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు 7 బస్తాల వ్యర్థాలను సేకరించి తరలించారు. జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లిలో స్వచ్ఛ భారత్ దివాస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద కేంద్రాలలో వానపాములను ఏర్పాటుచేశారు. ఆ పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలను సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్‌పి సిఇఒ దాసరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ శ్రీనివాసరావు, ఎపిడి ఆంజనేయులు, ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక తదితరులు పాల్గొన్నారు

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విశిష్ట సేవలకు గాను ఆనందపురం పంచాయతీ విస్తరణ అధికారి కెల్ల రామారావు జిల్లా కలెక్టర్ ద్వారా అవార్డు అందుకున్నారు. గండిగుండం సెక్రటరీ మౌలాలి, గొట్టిపల్లి సెక్రెటరీ సురేష్ బాబు ఉత్తమ సెక్రటరీలుగా అవార్డు అందుకున్నారు

మండలంలోని గ్రీన్ అంబాసిడర్లు ఆనందపురం పంచాయతీలో సుర రాంబాబు, గంభీరంలో చల్ల రమణ, శొంఠ్యాంలో చందల శంకర్, వేములవలసలో పైల రామారావు, వెల్లంకిలో పైల రాము అవార్డుతో పాటు ప్రశంస పత్రాలు అందుకున్నారు.

ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఘనంగా సాగింది. డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్ కుమార్ సాహూ పాల్గొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సహకారంతో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. పక్షం రోజుల నుంచి చేపడుతున్న కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన వారికి డిఆర్ఎం సర్టిఫికెట్లు, అవార్డులు అందజేశారు. తొలుత మహాత్మా గాంధీకి నివాళ్లర్పించారు.

హిందూస్థాన్ షిప్‌యార్డులో ప్రమాణం చేస్తున్న కార్మికులు

హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌లో..

హిందూస్తాన్ షిప్ యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో సిఎమ్‌డి, కమాండర్ హేమంత్ ఖత్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను తెలియజెప్పారు.

నాల్కో పోర్టులో..

నాల్కో పోర్టు ఫెసిలిటీస్‌లో సఫాయి మిత్ర సన్మాన్ శిబిర్ పేరుతో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. 21 మందికి పిపిఇ కిట్లు అందజేశారు.

నర్సీపట్నం టౌన్ : అబిడ్స్ సెంటర్లో మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేస్తూ స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు మునిసిపల్ ఉద్యోగులతో స్వచ్ఛతపై ప్రమాణం చేయించారు.. నర్సీపట్నంలో గాంధీజీ విగ్రహానికి ఆర్‌డిఒ రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, తహసిల్దార్ ఎల్. రామారావు, కౌన్సిలర్లు శ్రీకాంత్, మధు, టిడిపి టౌన్ సెక్రటరీ జివి రమణ, సానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

బీచ్‌లో చెత్తను సేకరించిన ఎన్‌సిసి క్యాడెట్లు

నక్కపల్లి : స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో శ్రమదానంతో ,పిచ్చి మొక్కలు తొలగించారు. ఉపమాకలో శ్రమదానం చేపట్టారు. చినదొడ్డిగల్లులో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, జెడ్‌పిటిసికాసులమ్మ, వైస్ ఎంపిపి నానాజీ, టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ,కొప్పిశెట్టి కొండబాబు, రామకృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి ,మీగడ సత్తిబాబు ,శ్రీనివాసరావు పాల్గొన్నారు

నాతవరం : స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించి, కార్యాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిటి టివిఎల్ రాజు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ ఎంవిఎస్ఎస్ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఎపిఒ చిన్నారావు ,సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : పౌరులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామ పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ తదితరులు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి రైల్వే బ్రిడ్జిపై చీపుర్లు పట్టి తుడిచారు.

కశింకోట : కశింకోటలో స్వచ్ఛతా హీ సేవా ముగింపు కార్యక్రమంలో భాగంగా శిలపరశెట్టి వీధిలో శుభ్రం చేశారు. గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఎంపిడిఓ రవి కుమార్, తహశీల్దారు అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

ఉచిత ఇసుక అమలుచేయాలి

ప్రజాశక్తి -ములగాడ : ఉచిత ఇసుక అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం మల్కాపురం గౌరవాధ్యక్షులు కె.పెంటారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జివిఎంసి 40వ వార్డు పరిధి ఎకెసి కాలనీలో, 63వ వార్డు పరిధి చింతల్లోవ కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఎకెసి కాలనీలో సిపిఎం నాయకులు ఎ.సత్యారావు, చింతల్లోవలో కె.పెంటారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇసామని చెప్పి ధరను భారీగా పెంచారని విమర్శించారు. డబ్బులు కట్టినా కూడా ఇసుక అందుబాటులో లేదన్నారు. గతంలో టన్ను ఇసుక రూ.1000 ఉంటే నేడు రూ.1900కి పెరిగిందని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక కుటుంబాలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇసుక మాఫీయా అక్రమార్జనలు పెరిగాయన్నారు. ఉచిత ఇసుక అమలుచేయాలని కోరుతూ ఈ నెల 4వ తేదీన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యాన చేపట్టే మహాధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. క్రాంతినగర్‌లో ఎం.ఆదినాయణ, పి.రురేష్, గంటా సత్యనారాయణ, దాసరి సత్తిబాబు, ఎకెసి కాలనీలో ఎం.కోటేశ్వరరావు, నూకరాజు, ప్రకాష్, వరలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

చదువుతోపాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి -మాధవధార : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు అలవర్చుకోవాలని మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ అన్నారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కరాటే తరగతులను ప్రారంభించి ఐదేళ్లు అయిన సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులకు క్రీడల పట్ల తల్లితండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని తెలిపారు. బిఎన్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు అప్పలరాజు మాట్లాడుతూ, బిఎన్ఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.రామారావు, కృష్ణారావు, కరాటే కోచ్‌లు సుధాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చైతన్య మహిళా కళాశాల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -గాజువాక : వరద బాధితుల సహాయార్థం గాజువాకకు చెందిన చైతన్య మహిళా డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం బుధవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు రూ.1,11,111 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెక్కును అందజేస్తున్న చైతన్య మహిళా డిగ్రీ కళాశాల ప్రతినిధులు, విద్యార్థినులు

రిలే దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న వి.ఎస్.పద్మనాభరాజు

గాంధీ స్ఫూర్తితో పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుందాం

యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వి.ఎస్.పద్మనాభరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : మహాత్మాగాంధీ స్ఫూర్తితో పోర్టు హాస్పిటల్‌ను కాపాడుకుందామని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వి.ఎస్.పద్మనాభరాజు పిలుపునిచ్చారు. విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలనీ కోరుతూ మంగళవారం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. బుధవారం నాటి దీక్షలను పద్మనాభరాజు ప్రారంభించారు. ముందుగా శిబిరంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పద్మనాభరాజు మాట్లాడుతూ, రూ.222 కోట్లు పెట్టుబడితో మల్టీస్పెషల్టీ హాస్పిటల్‌గా మారుస్తామని చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. పోర్టు దగ్గర సొంత నిధులు రూ.వేల కోట్లు ఉన్నాయని, వాటితోనే అభివృద్ధి చేయాలని డిమాండ్‌చేశారు. విశాఖపట్నం అభివృద్ధిలో పోర్టు చాలా కీలకమైందన్నారు. పోర్టు పన్నుల రూపంలో ప్రభుత్వాలకు రూ.171.42 కోట్లు చెల్లిస్తోందని తెలిపారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణపై అందరి సంతకాలు సేకరించి రక్షించుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ఈ దీక్షలో జె.సత్యనారాయణ, కె.సత్యనారాయణ, ఈశ్వరరావు, శ్రీను, రామారావు, వెంకటరావు, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో గ్రామసభలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో గాంధీ జయంతిని పరిష్కరించుకొని గ్రామ సభలు నిర్వహించారు, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొని ప్రజల సమక్షంలో సమస్యలను తెలుసుకొని అంచెలంచెలుగా పనులు చేయడానికి తీర్మానం చేశారు. రెడ్డిపల్లి పంచాయతీలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కె.దామోదరరావు గ్రామ సమస్యలను గుర్తించి తీర్మానం చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎంపిడిఒ ఎం.విజయ్ కుమార్ ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఇంటి నుంచీ తడి పొడి చెత్తలను సేకరించడానికి ఇంటింటికీ రెండు ప్లాస్టిక్ బకెట్లను పంపిణీ చేశారు. సేకరించిన చెత్తను ఈ కేంద్రానికి తీసుకొచ్చి సంపదను సృష్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టి.పాప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

3 నుంచి పోలమాంబ ఉత్సవాలు

ప్రజాశక్తి -తగరపువలస : సంగివలస పోలమాంబ కొత్తమ్మవార్ల దేవస్థానం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలపై యుటిఎఫ్ దీక్షలు

విశాఖలో నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. తొలుత సంఘం రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి ఆధ్వర్యంలో గాంధీ మహాత్మునికి నివాళ్లర్పించారు. జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన దీక్షా కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్ అంబేద్కర్ మాట్లాడారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు స్కూల్ ఎడ్యుకేషన్‌లో కలిపి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు ఇదే విద్యా వ్యవస్థలో ఉన్న మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించడం లేదన్నారు. మున్సిపల్ హైస్కూల్స్‌లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులను బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదని తెలిపారు. ప్రమోషన్లు, బదిలీలు రెగ్యులర్‌గా జరగడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఇఒ పోస్టులు ఇవ్వాల్సి వుందన్నారు. మున్సిపల్ టీచర్ల పిఎఫ్ ఖాతాలు మున్సిపాలిటీలలో నిరుపయోగంగా పడి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించని ఎడల ఈ నెల 17న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు టి.అప్పారావు, రొంగలి ఉమాదేవి, కె.రాంబాబు, చుక్క సత్యం, మహ్మద్ రిజ్వన్, టి జగన్, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద బుధవారం సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు కోటేశ్వరరావు ఉపాధ్యాయుల మెడలో పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జిటి, పండిట్, పీఈటి పోస్టులను అప్ గ్రేడ్ చేయాలని కోరారు. మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న హెడ్మాస్టర్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయులలో అర్హులైన వారిని అర్బన్ ఎంఈఓలుగా నియమించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆందోళన తీవ్ర తరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, మున్సిపల్ టీచర్స్ సంఘం నాయకులు అక్కునాయుడు, మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీష్, జిల్లా నాయకులు జోగా రాజేష్, శేషుకుమార్, జిఎస్ ప్రకాష్, ఎంవి అప్పారావు, దేముడు నాయుడు, మామిడి బాబూరావు, దాడి వెంకట జగ్గప్పారావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో సత్యాగ్రహ దీక్షలు చేస్తున్న ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నేతలు

సబ్ జైల్లో ఖైదీల సంక్షేమ దినోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక సబ్ జైల్‌లో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవ వేడుకలను జైల్ పర్యవేక్షణాధికారి వై.ఎన్.గణేష్ రెడ్డి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వాసవీ క్లబ్ సభ్యులు, గణేష్ రెడ్డి మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి లర్పించారు. వాసవీ క్లబ్ సభ్యురాలు పొట్టా లహరి ఖైదీల మనోవికాసానికి రూ.10 వేలు విలువ చేసే క్యారమ్ బోర్డులు, పండ్లు, స్వీట్లును వాసవీ క్లబ్ ప్రతినిధులు గ్రంధి లక్ష్మణరావు, జైల్ పర్యవేక్షణాధికారి చేతులమీదుగా ఖైదీలకు అందజేసారు. కార్యక్రమంలో సిద్దార్ధ సోషల్ సర్వీస్ %డ% కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం, వాసవీ క్లబ్ గవర్నర్ ఎల్‌కెపిఎమ్.నరశింగరావు, కొల్లూరు సత్య నారాయణ, విశ్రాంత తహశీల్దార్ పట్నాల క్రిష్ణ మోహన్, గ్రంధి లక్ష్మణరావు, గ్రంధి హనుమంతరావు, వి.శ్రీనివాసరావు, బొగ్గారపు రాజు తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : శాఖాహారంతోనే ప్రజలు ఆరోగ్యంగా జీవించగలరని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. విశాఖ పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ, అనకాపల్లి సంయుక్తంగా ఇందిరాలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన శాకాహార సద్భావన ర్యాలీని బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరం ఉండొచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి రామ్మోహన్రావు అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో తుప్పలను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడి డాక్టర్ సౌజన్య, వైద్యులు అనిల్, రామారావు, శ్యామల, భాను బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి బోరు పరిశీలన

ప్రజాశక్తి- కశింకోట : మండలం తాళ్ళపాలెం పంచాయతీ పరిధి సంత గ్రామంలో నూతనగా వేసిన తాగునీటి బోరును అధికారులు, నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది యశ్వంత, పర్యవేక్షకులు పావని, నాయకులు డాక్టర్ గల్లా రాజు, కర్రి లోవరాజు, కర్రి గోవిందా, పుర్రె నర్సింగరావు పాల్గొన్నారు

జిల్లాస్థాయి పోటీలకు కైట్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆటల పోటీలలో జిల్లా స్థాయికి అచ్యుతాపురం కైట్స్ విద్యా విహార స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ రెడ్డి గణేష్ తెలిపారు. తమ స్కూల్లో చదువుతున్న విద్యార్థులు చదరంగం, ఖోఖో, బ్యాడ్మింటన్, జెవెలిన్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

నడిరోడ్డుపై మద్యం అమ్మకాలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-దేవరాపల్లి : నడిరోడ్డుపైనే మద్యం అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం విధానానికి స్వస్తి పలుకుతూ, ప్రైవేట్ మద్యం దుకాణాలకు అనుమతినిస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రభుత్వం తక్కువ ధరతో అందించబోయే ఈ మద్యంలో నాణ్యత ఎంత అనేది ప్రశ్నార్థకమని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు తెరిచే ఉంటాయని ప్రభుత్వ చెబుతుందని, నూతన మద్యం విధానాన్ని సవరించాలని, మద్యం దుకాణాల సమయం, సంఖ్య కుదించాలని డిమాండ్ చేశారు. గుడి, బడి, జాతీయ రహదారుల వద్ద మద్యం షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు మద్యం షాపుల్లో పని చేసిన ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

ఎంపీ సిఎం.రమేష్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ ఇటీవల రైల్వే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులై తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా విశాఖపట్నం విమానాశ్రయంలో ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ స్వాగతం పలికి సత్కరించారు. సీఎం రమేష్ నియామకంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్ నిర్మాణం పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, 82వ డివిజన్ ఇంచార్జ్ పోలారపు త్రినాధ్, 83వ డివిజన్ ఇంచార్జ్ బొద్దపు ప్రసాద్, టిడిపి కసింకోట నాయకులు గొంతిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం రమేష్‌కు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

అచ్యుతాపురం : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పీలా గోవిందకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఇటీవల రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణను అనకాపల్లి గవరపాలెంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గవరపాలెం శ్రీకనక దుర్గమ్మ కమిటి సభ్యులు, గవరపాలెం, వేల్పుల వీధి శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ సభ్యులు, వేల్పుల వీధి పెద్దలు, వివిధ సంఘాల నాయకులు, జనసేన శ్రేణులు, న్యాయవాదులు ఉన్నారు.

నూతన ఎక్సైజ్ పాలసీని రద్దు చేయాలి

ఐద్వా ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

ప్రజాశక్తి- అనకాపల్లి

ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన మద్యం విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం నెహ్రూ చౌక్ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. మాణిక్యం డిడి వరలక్ష్మి మాట్లాడుతూ నూతన మద్యం విధానం ద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వం ఆర్జించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడడం దుర్మార్గమన్నారు. మద్యాన్ని నియంత్రించి నేరాలను, ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పనిచేయడం తగదన్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం తాగి 30 వేల మంది చనిపోయారని గుర్తు చేశారు. హింసకు, అత్యాచారాలకు, హత్యలకు కారణమవుతున్న మద్యాన్ని నిషేధించకుండా నూతన మద్యం విధానం ద్వారా చేస్తున్న అధ్యయనాలు అవసరమా అని ప్రశ్నించారు. హానికరమైన మద్యపానం వల్ల ప్రజలు ధనం మానప్రాణాలు కోల్పోతున్నప్పుడు మంచి బ్రాండ్ చెడు బ్రాండ్ అనే ప్రశ్న ఉత్పన్నం అవదని, తక్షణమే మద్యాన్ని నిషేధించాలని డిమాండ్ చేశారు. తాగుడుకు బానిస అయిన వారికి వైద్య సదుపాయం కల్పించాలని, డ్రగ్ అడిక్షన్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. తాగి వాహనాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, పేకాట, కోడిపందాలు, అక్రమ మద్యం సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు లక్ష్మి, నారాయణమ్మ, తులసి, సుగుణ, వరలక్ష్మి, జి లక్ష్మీ, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -వడ్డాది

అమ్మ హెల్పింగ్ హార్ట్స్, గ్రామీణ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని వడ్డాది జడ్పీ హైస్కూల్ గ్రౌండ్లో బుధవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో యువకులు తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విద్యార్థులు, యువకులు, మహిళలు, వికలాంగులు ఉద్యోగులు అన్ని వర్గాల వారు రక్తదానం చేశారు గ్రామీణ ప్రాంతంలో ఎంత పెద్ద ఎత్తున బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించడం ఇదే తొలిసారి అని వందేమాతరం బ్లడ్ బ్యాంక్ చైర్మన్, ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్ బాలు తెలిపారు. జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పోలీసు రెవెన్యూ అధికారులు శిబిరంలో పాల్గొన్నారు. అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు, వివిధ గ్రామాల యువకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రక్తదాతలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించారు. ఎంపీ సిఎం రమేష్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద, మాజీ ఎమ్మెల్యే గవరెడ్డి రామానాయుడు తదితరులు శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించారు.

బాట జంగాలపాలెంలో..

సబ్బవరం : మండలంలోని బాట జంగాలపాలెంలో బుధవారం జరిగిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గాంధీ జయంతి సందర్భంగా వైసిపి నాయకుడు బోలెం శంకర్ ఆధ్వర్యంలో ప్రతి ఏట లాగానే ఈ ఏడాది రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 45మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాన శిబిరానికి విశాఖ రోటరీ క్లబ్ వైద్యుల సారధ్యంలో దాతలకు పరీక్షలు చేసి రక్తాన్ని సేకరించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాపుశెట్టి కృష్ణ, సర్పంచ్ పడాల వెంకటరమణ, రంగాల గౌరీష్, తాడి నూకరాజు, బి.రామచంద్రరావు, ఉపాధ్యాయుడు పి.తమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

తాతయ్యబాబుతో మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

తాతయ్యబాబును కలిసిన సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించబడిన టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబును కొత్తకోట సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు, బుచ్చయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే పాస్‌లు మంజూరుకు జర్నలిస్టుల వినతి

ప్రజాశక్తి-వడ్డాది : రాయితీ రైల్వే పాసులు మంజూరు మంజూరు చేయాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు రైల్వే బోర్డ్ స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. గతంలో తమకు రైల్వే రాయితీ పాసులు ఉండేవని మళ్లీ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో మాడుగుల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు శరగడం రామకోటి, బత్తుల వేణు, ఆది పొలిబాబు, వియ్యపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు బండ్లను పరిశీలించిన కౌన్సిలర్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో మరమ్మతుకు గురై మూలకు చేరిన చెత్త తరలింపు బళ్లనును రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తనయుడు కౌన్సిలర్ రాజేష్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు బుధవారం పరిశీలించారు. చెత్త తరలింపులో పారిశుధ్య కార్మికులకు ఇబ్బందులు కలగకుండా వాటికి మరమ్మతులు చేయించి, సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వహయాంలో చెత్తతరలింపు బళ్లన్నీ మూలకు చేరడంతో కార్మికులు ఇబ్బందులు పడ్డారన్నారు. పారిశుధ్య పనులపై గత వైసిపి ప్రభుత్వం దష్టి పెట్టలేదని రాజేష్ ఆరోపించారు. త్వరితగతిన తోపుడు బళ్ళు, పుష్ కార్డులు, ట్రాక్టర్లు తదితర చెత్తను తరలించే వాహనాలను మరమ్మతులు చేసి సిద్ధం చేయాలని కోరారు.కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ దనిమిరెడ్డి మధు, లంక ప్రసాద్ టిడిపి నాయకులు. మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

నాలుగు మద్యం షాపులు కేటాయింపు

ప్రజాశక్తి-గొలుగొండ : నూతన మద్యం విధానంలో భాగంగా గొలుగొండ మండలానికి నాలుగు మద్యం షాపులు కేటాయించినట్లు మండల ఎక్సైజ్ ఎస్ఐ రహీం తెలిపారు. జనాభా ప్రాతిపదికన మండలంలో ఏటిగైరంపేట, ఏఎల్ పురం, చీడిగుమ్మల, జోగుంపేటలో షాపులు కేటాయించామన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రంలోగా గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తులు అందజేయాలని, 11న అనకాపల్లి పాతబస్టాండ్ వద్ద ఉప్పాల చంద్రశేఖర్‌రావు కళ్యాణ మండలంలో లాటరీ తీస్తారన్నారు.

అలరించిన యూత్ ఫెస్టివల్

ప్రజాశక్తి- వడ్డాది : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వడ్డాది జెడ్పీ హైస్కూల్లో బుధవారం నిర్వహించిన యూత్ ఫెస్టివల్ విశేషంగా అలరించింది. ఇందులో భాగంగా పలు జానపద, సామాజిక, సాంస్కృతిక కళ నృత్య ప్రదర్శనలు, బాడీ బిల్డింగ్ ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద, జనసేన ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు, ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్ బాలు, బిజెపి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తదితరులు యూత్ ఫెస్టివల్‌ను సందర్శించారు. కళాకారులను, చిన్నారులను సత్కరించి అభినందించారు.

నృత్యం చేస్తున్న విద్యార్థిని

ఉచిత ఇసుక పథకం అమలుకు

రేపటి నిరసనలను జయప్రదం చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం, ప్రకటించిన ఉచిత ఇసుక పథకం ద్వారా ఇసుక ఇవ్వాలని, భవన కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని కోరుతూ అక్టోబర్ 4న రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగి, విచ్చలవిడి అవినీతి వలన ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడి వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ఎన్నికల్లో ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడాలేకుండా పోయిందని పేర్కొన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి కొన్ని చోట్ల గతం కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని విమర్శించారు. ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలే ఇసుకపై పెత్తనం చేస్తున్నారని తెలిపారు. ఇసుక కొరత, అధిక రేట్ల వలన భవన నిర్మాణ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటుందని, నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోందని, ఇళ్ల నిర్మాణాలు చేసుకునే చిన్న, మధ్యతరగతి వర్గాలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రకటనలకూ, ఆచరణకు పొంతన లేకుండా ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోందని తెలిపారు. తక్షణమే ఉచితంగా ఇసుక ఇవ్వాలని, అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 4న జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలో ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని లోకనాథం కోరారు.

నేవీ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ధర్నా

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నేవీ కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి -రాంబిల్లి

నేవీ నిర్మాణంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఎన్ఏటిబి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మిక చట్టాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు జి దేవుడు నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం జరుపుతున్న నేవీ నిర్మాణ పనులు నేటికి 14 సంవత్సరాలుగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రధాన కంపెనీలైన ఎల్ అండ్ టి, ఐటిడిసి, ఎస్ఎల్ఎస్, కేకేఆర్, కేఈసి వంటి అనేక కంపెనీలు నిర్మాణ పనుల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. అన్ని రాష్ట్రాల నుండి వలస కార్మికులు వచ్చి పని చేస్తున్నారని, వీరంతా నిర్మాణ పనుల్లో రోజుకు 12 గంటలు పని చేస్తున్నారని తెలిపారు. కాని కార్మికులకు కనీస వేతనాలు అమలు కాలేదు, అదనపు పనికి ఓటీ ఇవ్వడం లేదని, సంవత్సరం పూర్తయిన కార్మికులకు బోనస్ చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్ హాలిడేస్ కూడా ఇవ్వటం లేదన్నారు. ఈ సమస్యలపై సెంట్రల్ లేబర్ కమిషనర్‌కి అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సెంట్రల్ లేబర్ కమిషనర్ పర్యవేక్షణ జరిపి కార్మిక చట్టాలు అమలు చేయని నేవీ నిర్మాణ కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ముందస్తు సమాచారం లేకుండా విధుల నుంచి తొలగిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే లేబర్ కమిషనర్‌కు అనేక ఫిర్యాదులు చేసి ఉన్నామని, వాటిపై వెంటనే విచారణ జరిపి కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.నారాయణ రావు, వై.రాము, నేవీ నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

మంద కృష్ణ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఈ నెల 11న విశాఖలో చేయనున్న పర్యటనను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు మాదిగ పిలుపునిచ్చారు. మహాజన సోషలిస్టు పార్టీ, మాదిగ ఉద్యోగ సంఘం, వికలాంగుల సంక్షేమ సంఘం, మాదిగ విద్యార్థి సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకులు అందరూ కలిసి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీల్లో ఉమ్మడి ఏబిసిడి వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ ఎన్నో సాహసోపేతమైన పోరాటాలు చేశారని తెలిపారు. దేవరాపల్లి ఎమ్మార్పీఎస్ సీనియర్ కార్యకర్త ఏలుసూరి చిన్న మహాలక్ష్మి(75) గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారని, ఆయన మృతి సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.ఎం.దాసు మాదిగ, మోర్తా శ్రీనివాసరావు, గొట్టువాడ పెంటారావు మాదిగ, రావాడ దేవుడు బాబు మాదిగ, ప్రకాష్ మాదిగ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలను పరిరక్షించాలి

ప్రజాశక్తి-గొలుగొండ : ప్రభుత్వరంగ పరిశ్రమలు పరిరక్షించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం గొలుగొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా నల్ల బ్యాడ్జీలతో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించి నిరసన చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని, నిత్యావసరాల ధరలు తగ్గించాలని, వర్షాలు, వరద బాధితులను ఆదుకోవాలని, అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు.ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలన్నారు.కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, సమాఖ్య నాయకులు కూడా దొరబాబు, బాబులు, సత్యనారాయణ, రాంబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

దసరా నవరాత్రులకు ఏర్పాట్లు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : దసరా సందర్భంగా గ్రామాలలో నవరాత్రుల కార్యక్రమాలు పూజలు చేయడానికి భక్తులు ప్రజాప్రతినిధులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా భగీరధి అమ్మవారి ఆలయంలో దసరా నవరాత్రులు ఉత్సవాలకు రూపొందించిన కరపత్రాలను బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. తిమ్మరాజుపేట గ్రామానికి చెందిన జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రులు కార్యక్రమానికి పరిసరాలను పరిశుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్త మోసాయిపేట గ్రామానికి చెందిన భవాని భక్తులు నవరాత్రుల సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు 20 శాతం షాపులు కేటాయించాలి

గాంధీ విగ్రహాలకు వినతులు

ప్రజాశక్తి -కె.కోటపాడు

టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కల్లుగీత కార్మికులకు 20శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని కోరుతూ ఏపీ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర దేవుడు ఆధ్వర్యాన బుధవారం మండలంలోని ఎ కోడూరులో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు టెండర్ విధానం లేకుండా సొసైటీ లైసెన్స్ ప్రకారం షాపులు కేటాయించాలని కోరారు. ఇచ్చిన హామీని విస్మరించి 10శాతం మాత్రమే షాపులు కేటాయిస్తామని చెప్పడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో గీత కార్మిక సొసైటీ నాయకులు శెట్టి రమణ, గీత కార్మికులు పాల్గొన్నారు.

చోడవరం : కల్లుగీత కార్మికులకు మేలు చేసే విధంగాకొత్త మద్యం పాలసీని రూపొందించాలని కోరుతూ చోడవరంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చోడవరం, అంకుపాలెం టిసిఎస్ అధ్యక్షులు మహాలక్ష్మి, అట్ల అప్పారావు, ఉపాధ్యక్షులు పిల్లి ప్రసాద్, కార్యదర్శి కదిరి పోతురాజులు మాట్లాడుతూ గీత కార్మికులకు రూ.5000 కోట్లతో ప్రభుత్వం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, వృత్తిని పరిశ్రమగా గుర్తించి, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10 లక్షలు, అంత్యక్రియలకు రూ.25 వేలు ఇవ్వాలని కోరారు. బాటిలింగ్ సౌకర్యం కల్పించి నిల్వ ఉండేలా స్టార్ హోటల్స్‌కు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేరళ ప్రభుత్వం మాదిరిగా గీత కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చోడవరం అంకుపాలెం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులు, మహిళలు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గీత కార్మిక కుటుంబాలు

నర్సీపట్నం టౌన్ : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నర్సీపట్నం కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో ఉన్న గాంధీజీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కల్లుగీత కార్మికులకు కార్పొరేషన్ ద్వారా రూ.5000 కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కొత్త జిల్లాల్లో కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కేరళ మాదిరిగా కల్లు నిల్వచేసుకునేందుకు సౌకర్యాలను కల్పించాలని కోరారు. వృత్తి పనిలో గీత కార్మికులు ప్రమాదానికి గురైతే రూ.పది లక్షలు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరారు. తాటి, ఈత చెట్టు నరికేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు కొత్త చట్టం చేయాలని కోరారు. కల్లుగీత కార్మికులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిలో ఉన్న వారికి వయసుతో సంబంధం లేకుండా పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తాతబ్బాయి నూకరాజు అప్పారావు రమణ తదితరులు పాల్గొన్నారు

జాతిపిత గాంధీజీకి ఘన నివాళి

అనకాపల్లిలో గాంధీజయంతిలో ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్

జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పలుచోట్ల నిర్వహించారు. వారి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పలుచోట్ల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

భీమునిపట్నం : ఎండిఒ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి ఎంపిపి డివిఎస్ఎస్ఎన్ రాజు, జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, ఎండిఒ ఎన్.హనుమంత రావు, ఎస్‌విఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీ చిత్రపటానికి ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి హెచ్ఎం జి.సత్యనారాయణ, జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, బీచ్‌లోని మహాత్మా గాంధీ పార్కులో విగ్రహానికి టిడిపి మూడో వార్డు నాయకులు గంటా నూకరాజు, చురకల రమణ తదితరులు, మాల మహానాడు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాలరావు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి, వైసిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి అక్కరమాని రామునాయుడు, అల్లిపిల్లి నరసింగరావు, జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తగరపువలస జంక్షన్‌లో ఉన్న గాంధీజీ విగ్రహానికి టిడిపి నాయకులు తమ్మిన సూరిబాబు, కొప్పల కృష్ణ, ఎఐటియుసి కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి యూనియన్, సిపిఐ నాయకులు అల్లు బాబూరావు, కె.రాంబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పెందుర్తి : 94వ వార్డు పరిధి వేపగుంటలో గాంధీ చిత్రపటానికి లాయర్ మహేష్, శంకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు.

సీతమ్మధార: ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు డి.సుమన్ కల్యాణి, బి.రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వేపగుంట : కృష్ణానగర్‌లోని విశాఖపట్నం ఇండో హ్యూమన్ రైట్స్ కేర్ ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేషనల్ చైర్మన్ రాజాన ప్రసాదరావు, ఆర్ ఇషిత పాల్గొన్నారు. వేపగుంట కూడలిలో ఓపెన్ జిమ్ అండ్ వాకర్స్ అసోసియేషన్, ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీ జయంతిని నిర్వహించారు. ఆకుల శ్రీనివాసరావు, సుంకరి రాము పాల్గొన్నారు.

మధురవాడ : గీతంలో మహాత్మా గాంధీ విగ్రహానికి ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్.గంగాధరరావు, జివిఎంసి 5వ వార్డు పరిధిలో పలుచోట్ల కార్పొరేటర్ మొల్లి హేమలత, 7వ వార్డు పరిధిలో పలు చోట్ల కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ గాంధీ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 7వ వార్డు స్వాతంత్రనగర్ కాలనీలో గాంధీ విగ్రహానికి పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగోతి సూర్య ప్రకాష్ పూలమాల వేశారు. కొమ్మాది కూడలి వద్ద గాంధీకి సిఐటియు నాయకులు అప్పలరాజు ఆధ్వర్యాన నివాళులర్పించారు. చంద్రంపాలెం బాపూజీ కళామందిరంలో గాంధీ విగ్రహానికి గ్రామస్తులు నివాళులర్పించారు.

గీతంలో గాంధీజీ విగ్రహానికి నివాళులు

విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గాంధీ విగ్రహానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పూలమాల వేసి నివాళలర్పించారు.రిజిస్ట్రార్ ఆచార్యఇఎన్. ధనుంజయ రావు, ప్రిన్సిపల్స్, డీన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆనందపురం : తర్లువాడలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులు పదిమందికి సర్పంచ్ బిఆర్‌బి నాయుడు సొంత నిధులతో ఇన్స్యూరెన్స్ ప్రీమియం చెల్లించారు. ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, మజ్జి వెంకట్రావు పాల్గొన్నారు. వెల్లంకిలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కంచరాపు శ్రీను పాల్గొన్నారు. గంభీరంలో సర్పంచ్ వానపల్లి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. 14 మంది గ్రీన్ అంబాసిడర్లకు సర్పంచ్ సొంత నిధులతో ఇన్స్యూరెన్స్ పాలసీని చేశారు. వానపల్లి ముత్యాలరావు, బొట్ట శ్రీను పాల్గొన్నారు. ఆనందపురం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుదాస్, ఆనందరావు పాల్గొన్నారు. ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో జనసేన నాయకులు గాంధీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మజ్జి శ్రీను, తమ్మిన అప్పలరాజు పాల్గొన్నారు. పెద్దిపాలెంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని నిర్వహించారు. సర్పంచ్ భారతమ్మ, మరుపిళ్ళ చిన్నయ్య పాత్రుడుపాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట ప్రాథమిక పాఠశాలఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, నాయకులు ఎం.మహేష్ బాబు, కె.కాశీరావు, సిహెచ్ సోమేష్, పి.శ్రీను, ఎం.జాన్, పి.రాజు, సిహెచ్ రాజు, కె.కాశీ పాల్గొన్నారు గాంధీ జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి అధికారులు , ప్రజాప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు.

నక్కపల్లి, మునగపాకల్లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న సిపిఎం , ప్రజాసంఘాల నేతలు

ఆరిలోవ : 12వ వార్డు తోటగరువు టిడిపి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి, గీతం వ్యవస్థాపకులు ఎంవివిఎస్ మూర్తి చిత్రపటానికి కూడా పూల మాలలు వేసి నివాళు లర్పించారు కార్యక్రమంలో ఒమ్మి సన్యాసిరావు, గాడి సత్యం పాల్గొన్నారు.

గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే గణబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ పాల్గొన్నారు.

గాజువాక : జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎస్‌వికె.పరశురాం ఆధ్వర్యాన సుందరయ్య కాలనీలో గాంధీ జయంతిని నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక గాజువాక ప్రధాన కార్యదర్శి ఎం.సింహాచలం, కె.కిరణ్మయి, లలిత, పద్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి సమీపంలోని సెంట్రల్ పార్కు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, కార్పొరేటర్లు బిపిన్ జైన్, భీశెట్టి వసంత లక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఎయులో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మై భారత్ పోర్టల్ డైరెక్టర్ సారా జయల్ సాక్మీ పాల్గొన్నారు.

హెచ్ఎస్ఎల్‌లో.. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో మహాత్మా గాంధీకి సిఎమ్‌డి హేమంత్ ఖత్రీ తదితరులు నివాళ్లర్పించారు. గాంధీ మార్గం అనుసరణీయమన్నారు.

వి సెజ్‌లో.. వి సెజ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్ ముప్పాల, జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోష్ని అపరంజి కొరాటి, పలువురు అధికారులు పాల్గొన్నారు. గాంధీకి ఘన నివాళ్లర్పించారు. హౌస్ కీపింగ్, హార్టికల్చర్ సిబ్బందిని సత్కరించారు. హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు.

అనకాపల్లి : జాతిపిత మహ్మాత్మా గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సందర్భంగా బుధవారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు గాంధీ విగ్రహానికి, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఏపీయుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, కలెక్టర్ విజయ కృష్ణన్, జెసి జాహ్నవి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీ, శాస్త్రి చిత్ర పటాలకు డిఆర్ఒ దయానిధి, జెసి జాహ్నవి, ఆర్‌డిఒ చిన్ని కృష్ణ, డిపిఒ శిరీష రాణి నివాళు లర్పించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్‌బి డిఎస్‌పి బి.అప్పారావు పోలీసు అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక వైసిపి కార్యాలయంలోనియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మాజీ ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, దంతులూరి దిలీప్ కుమార్, శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కాళ్ళ వెంకటసత్యనారాయణ, తుట్ట రమణ గాంధీనగరంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర మానవ హక్కుల కార్యదర్శి శ్యాం ప్రసాద్ ఎన్టీఆర్ హాస్పిటల్‌లో రోగులకు రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

మునగపాక : మండలంలోని మునగపాక, వెంకటాపురం, తోటాడ, మూలపేట, తిమ్మరాజుపేట గ్రామాలలో గాంధీకి నివాళులరింపచారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జనసేన నేత టెక్కలి పరశురాం పాల్గొన్నారు. స్థానిక పిఎసిఎస్ ఆవరణ, కెజిబివిలో గాంధీ విగ్రహాలకు వైసిపి నేత బొడ్డేడ ప్రసాద్ పూలమాలలు వేశారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం గ్రామంలో గాంధీ చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తలాయి మహాలక్ష్మి నాయుడు, చిన్ని రామారావు, పండూరి పద్మారావు, ఎస్ రామకృష్ణ, ఎదురీరి రమణ, ముమ్మిన చిన్నమ్మలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక అయ్యన్న విద్యాసంస్థల ప్రాంగణంలో గాంధీజీ విగ్రహానికి, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటానికి ఎంఈఓ 1, 2లు కె.సత్యనారాయణ, డివిడి ప్రసాద్, విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాసీం నివాళులర్పించారు.

సబ్బవరం : స్థానిక ఎంపిడి కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీఓ పి.పద్మజ పూలమాలలు వేశారు. అనంతరం దండు కోనేరు చుట్టూ ఉన్న తుప్పలను తొలగించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ పిన్నింటి రమణ నివాళులర్పించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట్టలో వైసిపి ఆధ్వర్యాన వైస్ ఎంపీపీ దొండ నారాయణమూర్తి గాంధీకి నివాళులర్పించారు. బంగారుమెట్టలో ఎంపిటిసి కోరుకొండ రమణ, పాల సంఘం అధ్యక్షులు తాతయ్య బాబు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక గాంధీ పార్క్‌లో బాపూజీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పడాల కొండలరావు పూల మాల వేసి నివాళులర్పించారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు పుట్టా గుప్తా, పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలో గల దిబిడి, కందిపూడి గ్రామాల్లో గాంధీ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కశింకోట : కశింకోటలో సర్పంచ్ జయ రజిని, చింతలపాలెంలో నైనముశెట్టి రమణ రావు, తాళ్ళపాలెంలో సర్పంచ్ నాగయ్యమ్మ, బయ్యావరంలో సర్పంచ్ గొల్లివిల్లి జయ శ్రీనివాసరావు గాంధీకి నివాళులర్పించారు.

అచ్యుతాపురం : అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో గాంధీ విగ్రహానికి డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కే సోము నాయుడు పూలమాలవేశారు. గాంధీ ఆశయాలు, ఆదర్శాలను అనుగుణంగా పనిచేయాలని కోరారు.

కోటవురట్లలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఉదయశ్రీ

కోటవురట్ల: మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి ప్రత్యేక అధికారిని ఉదయశ్రీ, తాహసిల్దార్ తిరుమలబాబు పూలమాలలు వేశారు. ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు పలు గ్రామాల్లో స్వచ్ఛతాహీ సేవలో పాల్గొన్నారు, పరిశుభ్రతపై నినాదాలు చేస్తూ ర్యాలీ ప్రధాన కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. మండల టిడిపి నాయకులు జానకి శ్రీను,సర్పంచ్ అనిల్ కుమార్, ఎంపీటీసీ సభ్యులు పి సూర్యరావు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక రామాలయం వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. క్లాప్ మిత్రలకు యూనిఫామ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీడీవో సువర్ణ రాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పూడి పునరావాస కాలనీలో గాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. మార్టూరు గ్రామంలో ఆరుగురు వ్యక్తులకు రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెదురువాడలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పూడి వైఎస్ఆర్ నగర్‌లో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు దంత వైద్యులు అడిగర్ల సుధీర్, ద్వారపురెడ్డి బాబ్జి పాల్గొన్నారు.

ఎస్ రాయవరం.: అడ్డరోడ్డు సెంటర్లో గాంధీ విగ్రహానికి ఎపి వ్యవసాయ కార్మికసంఘ జిల్లా అధ్యక్షులు ఎం.సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఉమ్మడి గోవిందు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాత వీర్రాజు, అబద్ధం గోవిందు, జాగారపు రమణ అప్పారావు పాల్గొన్నారు

గొలుగొండ : గాంధీ చిత్రపటానికి తహశీల్దార్ పి.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇఒపిఆర్‌డి రత్నకుమారి, డిటి చయనులు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో వాసవి ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ లోచల సుజాత పూలమాల వేసినివాళులర్పించారు. ఎన్‌సిసి క్యాడెట్ల గౌరవవందనం స్వీకరించారు. గ్రామ కార్యదర్శి వై. శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డి అచ్చిరాజులు, ఎఎస్ఐ ఆళ్ళ నూకరాజు, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు దర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: గాంధీ జయంతి సందర్భంగా డల్లాస్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆయనతో పాటు రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి ఎన్‌ఆర్ఐకోఆర్డినేటర్ కోమటి జయరాం, ఎన్నారై ఇన్వెస్టర్స్ కోఆర్డినేటర్ రామకృష్ణ గుళ్లపల్లి పాల్గొన్నట్లు తెలిపారు.

నర్సీపట్నం టౌన్: సరస్వతి జంక్షన్‌లో గాంధీ విగ్రహానికి ఆయుష్మాన్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 25 వేల సీడ్ బాల్స్ నర్సీపట్నం డివిజన్ డిఎఫ్ఒకు అందజేశారు. విద్యాసంకల్ప వెలగా నారాయణరావు జోన్ చైర్మన్ వెంకటకృష్ణ ప్రెసిడెంట్ శీరం లక్ష్మణరావు సెక్రెటరీ కేతవరపు అయ్యప్ప, ట్రెజరర్ మండా సతీష్ క్లబ్ సభ్యులుపాల్గొన్నారు.

డల్లాస్‌లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న అయ్యన్న

కేంద్రంలో నిరంకుశ బిజెపి పాలన పోవాలి

ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : మతాలు, కులాల మధ్య వైషమ్యాలను పెంచి, మత సామరస్యాన్ని దెబ్బతీసే కేంద్రంలోని బిజెపి నిరంకుశ పాలన పోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'మహాత్మా పాసిస్ట్ శక్తుల నుంచి ఈ దేశాన్ని కాపాడు'అనే నినాదంతో నిరసన చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి షర్మిల పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, మంచిని బంధించవచ్చు గానీ, భావాలను బంధించలేమని గాంధీజీ ఉద్బోధించారన్నారు. గాంధీజీ నమ్మిన సత్యం, అహింస, సమానత్వం ఇప్పుడు కనిపిస్తున్నాయా అని ప్రశ్నించారు. ఇప్పుడున్న పాలకులు సష్టిస్తున్నది గాంధీ సిద్ధాంతం కాదని, గాడ్సే సిద్ధాంతం అన్నారు. లౌకిక భారతదేశంలో మత సామరస్యానికి చిచ్చుపెట్టే విధంగా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని దేశంలో మోడీ ప్రభుత్వం నడుపుతోందని ఆరోపించారు. ఎప్పుడూ మతాన్ని కులాన్ని వాడుకోవాలనే ఆలోచనలోనే బిజెపి ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల

గాంధీ మార్గంలో వెళుతున్న వ్యక్తి రాహుల్‌గాంధీ అన్నారు.దేశ స్వాతంత్రం కోసం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. చంద్రబాబు తిరుపతి లడ్డూను అడ్డం పెట్టుకొని పూజలు చేస్తున్నారని, పవన్ కళ్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షలు అంటుంటే, జగన్మోహన్‌రెడ్డి ప్రక్షాళన దీక్షలు చేస్తున్నారని ఆరోపించారు. తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపిస్తున్న వ్యవహారంపై, మొదట నుంచి తాము చేస్తున్న డిమాండ్ ప్రకారం సుప్రీంకోర్టు స్పందించిందని తెలిపారు. తాము ముందు నుంచి డిమాండ్ చేస్తున్నట్లు ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తు జరగాలన్నారు. విశాఖలో ప్రభుత్వరంగంలో స్టీల్ ప్లాంట్‌ను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, దానిని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్నారు. మొదటినుంచి తాము దానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు కాంగ్రెస్ పార్లమెంట్ సమన్వయకర్త పి.సత్యారెడ్డి, డిసిసి అధ్యక్షుడు వర్మరాజు (హసిని వర్మ), వాసుపల్లి సంతోష్ కుమార్, మూల వెంకటరావు, సోడదాసి సుధాకర్ పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల్లో వినయ్ విద్యాసంస్థల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో వినయ్ విద్యాసంస్థల విద్యార్థులు మొదటి స్థానం దక్కినట్టు ఆ సంస్థ కరస్పాండెంట్ బత్తుల వాసు తెలిపారు. అడ్డరోడ్డులోని శ్రీ ఆదర్శ స్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో ఎనిమిది జట్లు పాల్గొనగా, వారిలో పెద్ద గుమ్మలూరు జెడ్‌పిహెచ్ స్కూల్ మొదటి స్థానం, దార్లపూడి జడ్‌పిహెచ్ఎస్ రెండవ స్థానం దక్కించుకున్నాయి.

అలాగే ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్ రాయవరం వినయ్ విద్యాసంస్థ మొదటి స్థానం దక్కించుకున్నట్టు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు లావణ్య, హేమమేర్, జస్విని మంచి ప్రతిభ కనబరిచారన్నారు. ఈనెల 27న అచ్యుతాపురంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

మహాలక్ష్మినాయుడుకు సత్కారం

ప్రజాశక్తి - కొత్తకోట : విజన్ 2025-ఇన్‌క్లూజివ్ ఆంధ్రా' రాష్ట్ర కీ రిసోర్స్‌పర్సన్, మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల స్కూల్‌అసిస్టెంట్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడును ఆదివారం ఘనంగా సన్మానించారు.

రావికమతం మండలంలో అందించిన సేవలకు, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం యస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన విజన్ 2025-ఇన్ క్లూజివ్ ఆంధ్రాలో భాగంగా ఐఈఆర్‌పిలకు, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష సహిత విద్య రాష్ట్ర కీ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించి, డిజిటల్ ట్యాబ్ లలో ప్రత్యేక శిక్షణను అందించారు. మహాలక్ష్మినాయుడును పశ్చిమ గోదావరి జిల్లా సమగ్రశిక్ష ఎపిసి శ్యాంసుందర్, విద్యా కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం అధికారులు వై.నరసింహం, శ్రీనివాస్ సత్కరించారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - నాతవరం: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘాపెట్టి ఆదివారం నాతవరం ఎస్ఐ సిహెచ్ భీమరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటువంటి అనుమతులు లేకుండా వాహనాలు నడిపే వారిపైనా, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టి ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత శ్రమదానం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: మండలంలో తిమ్మాపురం శివారు కొనవానిపాలెం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహించినట్లు శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం అధ్యక్షులు కోన అప్పలరాజు తెలిపారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తచెదారాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. రోడ్లను తవ్వేసి వదిలేసిన గుంతలను శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం, బాలగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో సిమ్మెంట్, ఇసుక, మెటల్‌తో పూడ్చిపెట్టారు. కార్యక్రమంలో సేనాపతి బాబురావు మాస్టారు, మాజీ సర్పంచ్ వంగలపూడి గోవింద్, మామిడి నాగరాజు, డి సత్యనారాయణ, కోన గురాచార్యులు, కోన దుర్గాప్రసాద్, కోన లవరాజు పాల్గొన్నారు.

మినీ గోకులం పెండింగ్ బిల్లులపై విచారణ

ప్రజాశక్తి - మాడుగుల: మండలంలో 2018-21 మధ్య కాలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన మినీ గోకులం షెడ్ల పెండింగ్ బిల్లులపై బుధవారం విచారణ నిర్వహించారు. మాడుగుల కేంద్రంలోని మినీ గోకులం షెడ్లను పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ రాష్ట్ర కార్యాలయం నుండి డిప్యూటీ కమిషనర్ విజిలెన్స్ స్టేట్ టీం మానిటర్ సత్యనారాయణ, గౌరీ శంకర్ ఆధ్వర్యంలోని బృందం లబ్ధిదారులను కలిసి, షెడ్లను పరిశీలించారు. పెండింగ్ బిల్లుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మండలంలో మిగిలిన గ్రామాలలో ఉన్న లబ్ధిదారుల షెడ్లను పరిశీలిస్తామన్నారు. లబ్ధిదారులంతా బ్యాంక్ ఖాతా లావాదేవీల వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు.కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ పర్సన్ గోవింద్, జిల్లా రిసోర్స్ పర్సన్ రాజు పాల్గొన్నారు.

సెలవుల నిబంధనలు బేఖాతరు!

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన, వినతి

ఆర్‌డిఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : దసరా సెలవులతోపాటు గాంధీ జయంతి రోజున నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలను తెరుస్తున్నారని ఎస్ఎఫ్ఐ విమర్శించారు. దీనిపై బుధవారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం ముందు ప్లకార్డులు పట్టుకొని నిరసన నినాదాలు చేశారు . ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రెసిడెంట్ జనార్దన్, రాజు, డివైఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ మాట్లాడుతూ ప్రభుత్వ సెలవు అయినా నిబంధనలను ఉల్లంఘించి వివేకానంద పాఠశాల, సాయి కళాశాల, శ్రీవిద్య కళాశాల , ఆదిత్య కళాశాల, వివేకానంద కళాశాలల్లో బుధవారం క్లాసులు నిర్వహించారన్నారు. విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తున్నారని. సెలవు దినం లేకుండా ఇబ్బంది పెట్టి చదివించడం చాలా దారుణమన్నారు. సెలవు రోజుల్లో పాఠశాలలు, కళాశాలలను తెరిస్తే సంబంధిత యాజమాన్యాలపై కఠినచర్యలతోపాటు గుర్తింపు రద్దు చేస్తామని బాలల హక్కుల కమిషన్ వంటి సంస్థలు హెచ్చరించినప్పటికీ, అధికారుల్లో ఎటువంటి మార్పు లేదు. సెలవు రోజున తరగతులు నిర్వహించిన ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి వివరణ కోరి తర్వాత తగు చర్యలు చేపట్టడం ద్వారా ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం ఆఆర్‌డిఓ వివి రమణకు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు భూషణ్, జయకృష్ణ, దుర్గ రాజు, ధర్మ పాల్గొన్నారు.

తల్లీకూతుళ్లకు క్రీడా పతకాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : మలేషియా సింగపూరులో గత నెల 22 నుంచి 30వరకు సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి ఆటల పోటీలలో ఉపాధ్యాయిని పివిఎం. నాగజ్యోతి, ఆమె కుమార్తె కలగర్ల సాహితి ఏడు పతకాలను సాధించారు. బుధవారం వాసవి కళ్యాణమండపంలో విలేకర్లతో మాట్లాడుతూ స్విమ్మింగ్‌లో 50, 100మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లోనూ, 50 మీటర్ ఫ్రీ స్టయిల్ విభాగాలలో సాహితి ప్రథమ స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించింది. నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్, అథ్లెటిక్స్ విభాగంలోని డిస్కస్ త్రో, జావెలిన్ త్రోలలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు ,100 మీటర్స్ రన్నింగ్‌లో ద్వితీ స్థానంలో నిలిచి ఒక వెండి పతకం మొత్తం నాలుగు పథకాలు సాధించారు. ఇప్పటికే ఎన్నో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటిన వీరు తాజాగా సింగపూరులోనూ ప్రతిభ కనబరిచి పతకాలను సాధించడంపై వీరిని పాఠశాల హెచ్ఎం, సహోపాధ్యాయులు, విద్యార్థులు అభినందించి, సత్కరించారు.కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గోపీనాథ్, వ్యాపారవేత్త వెలగ నారాయణరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సిబిఎస్ఇ క్రీడా పోటీలు

ప్రజాశక్తి- నక్కపల్లి : పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో బుధవారం సిబిఎస్ఇ క్లస్టర్ -7 (ఆంధ్ర, తెలంగాణ) కబడ్డీ, వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 100 పాఠశాలలకు చెందిన దాదాపు 1200 మంది విద్యార్థులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించడానికి తరలివచ్చారు. బాలికలకు అండర్-14,17,19 విభాగాలలో జరుగుతున్న ఈ పోటీలను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయప్రకాష్ జాతీయ జెండా, సిబిఎస్ఇ స్పోర్ట్స్, పాఠశాల జెండాలను ఆవిష్కరించి, ఎగురవేసి ప్రారంభించారు.

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న విజయప్రకాష్

ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా రాణించాలని, ఆటలో నిత్య సాధన, నేర్చుకునే మెళకువలు వారిని ఆ స్థాయికి తీసుకువెళతాయన్నారు. వారు తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయప్రకాష్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారంతా గెలుపోటములు చూడకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. రెండు రాష్ట్రాల నుండి పోటీలకు హాజరైన జట్ల కెప్టెన్, సభ్యులను విజయ్ ప్రకాష్ అతిథులు పరిచయం చేసుకున్నారు. రిటైర్డ్ కబడ్డీ కోచ్ ,ప్రో కబడ్డీ అఫిషియల్ పివిఎస్‌వి ప్రసాద్, ప్రో కబడ్డీ అఫిషియల్ బి. మురళీకుమార్, నేషనల్ వాలీబాల్ రిఫరీ బి.శ్రీనివాసరావు, వాలీబాల్ అసోసియేషన్ మెంబర్ మోహన్‌బాబు లతోపాటు పోటీల పరిశీలకులు ఎల్. వెంకట రమణ, కె. హేమంత్ కుమార్‌రావు, వివిధ స్కూల్స్ నుండి వచ్చిన విద్యార్థినులు, కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు దుర్గాభవాని

ప్రజాశక్తి - నాతవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెద గుమ్మలూరు జెడ్‌పిహెచ్ఎస్‌లో జరిగిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో సోషల్ వెల్ఫేర్ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ నాతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కోసూరు దుర్గాభవాని చక్కని ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం కోటేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినితోపాటు ఫిజికల్ డైరెక్టర్ ఎం కోటేశ్వరరావును పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిశంకర్, సీనియర్ ఉపాధ్యాయురాలు పిఎస్ రత్నం, సోషల్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, లేడీస్ హాస్టల్ వార్డెన్ కె సూకరత్నం, పాఠశాల ఛైర్మన్, ఉపాధ్యాయులు సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.

పతకాలతో దుర్గాభవాని

హ్యాండ్ బాల్ పోటీల్లో చోద్యం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-గొలుగొండ : ఉమ్మడి జిల్లాల అండర్ 17 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలో చోద్యం విద్యార్థిని పి.మౌనిక మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి ఎంపికైనట్లు పిఈటీ కుందూరు సూకరాజు తెలిపారు. హెచ్ఎం పి.శ్రీనివాసరావు, స్కూల్ ఛైర్మన్ పోతల సత్తిబాబు, ఉపాధ్యాయులు సిహెచ్‌వి .రమణ, వరప్రసాద్, వాసు, బోధనా, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మౌనికను అభినందిస్తున్న హెచ్ఎం

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు టి.అర్జాపురం విద్యార్థులు

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం టి.అర్జా పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థు లు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ ఎం నాయుడు, పీడీ రమేష్‌నాయుడు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన అండర్ 14,17 విభాగాల జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో వీరు సత్తా చాటారు. అండర్ 14 విభాగంలో జయ, జానకి, యమున మంచి ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని పీడీ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం, పీడీలతోపాటు గ్రామ సర్పంచ్ పొల్నాటి, వైస్ ఎంపీపీ భవాని ప్రసాద్, మండల టీడీపీ నాయకులు కొండనాయుడు, సిఆర్‌పి జి.రామారావు అభినందించారు.